సాక్షి ప్రకాశం

సోమవారం । 5 । జూన్ । 2023



ఈ ఫలం విషతుల్యం
నిషేధిత రసాయనాలతో అమృత ఫలాలను వ్యాపారులు విషంగా మార్చేస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారు. - 8లో..



కేవైసీ అప్‌డేట్ పేరుతో మోసాలు
కేవైసీ అప్‌డేట్ పేరుతో జరుగుతున్న మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలిక గర్గ్ కోరారు. ఇలాంటి మోసాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
41 /33

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటీరెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలులు వీస్తాయి

న్యూస్‌రీల్

అండర్‌-19 రాష్ట్రస్థాయి చెస్‌ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి చెస్‌ పోటీలకు ఎంపికైన బాలబాలికలు

ఒంగోలు: అండర్‌-19 రాష్ట్రస్థాయి చెస్‌ పోటీల్లో పాల్గొనే బాలబాలికలను ఆదివారం స్థానిక వేదశ్రీ పాఠశాలలో ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియను జిల్లా చెస్‌ అసోసియేషన్‌ కార్యదర్శి షేక్‌ అబ్దుల్‌ నబీ పర్యవేక్షించారు. బాలుర విభాగంలో పమిడి జశ్వంత్‌, షాఫీజ్‌ సయ్యద్‌, కుల్లిబోయిన వెంకట దినేష్‌, రాజమానేంద్ర బాబులు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. బాలికల విభాగంలో లౌక్యశ్రీ ప్రియ ఎరిగల, వేదశ్రీ ,కొల్లా దేవి ప్రవస్థ మేధ, దివ్య చిమ్మిరి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్‌ కార్యదర్శి అబ్దుల్‌ నబీ తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను వేదశ్రీ పాఠశాల కరస్పాండెంట్‌ కొల్లా సోమశేఖర్‌ బహుమతులు అందించి అభినందించారు.

7 నుంచి రాష్ట్రస్థాయి పశు ప్రదర్శనలు

పెద్దారవీడు: మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామ సమీపంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత గొౖడాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పశు ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 7వ తేదీన ఆరుపండ్ల సైజు విభాగంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులుగా రూ.35 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు అందజేస్తామన్నారు. 8వ తేదీన న్యూ కేటగిరి విభాగంలో మొదట, రెండు, మూడు, నాల్గవ, ఐదవ బహుమతులు రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందజేస్తామన్నారు. 9వ తేదీన సీనియర్‌ విభాగంలో బహుమతులుగా రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు రూ.20 వేలు దాతలు ప్రకటించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9959132286, 9502765259, 9441942726 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రవాణా శాఖ ఉప కమిషనర్‌గా సుశీల



రాయని సుశీల

ఒంగోలు: రవాణాశాఖ ఉప కమిషనర్‌గా రాయని సుశీలను నియమిస్తూ రవాణా శాఖ కమిషనర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రవాణాశాఖ ఉప కమిషనర్‌ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌గా పనిచేశారు. అనంతరం పదోన్నతిపై నెల్లూరు జిల్లా ఆర్‌టీఓగా బదిలీ అయ్యారు. తాజాగా మరోసారి పదోన్నతి పొంది రవాణాశాఖ ఉప కమిషనర్‌గా జిల్లాకు మరలా బదిలీ అయ్యారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు రవాణాశాఖ ఉప కమిషనర్‌ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

కడలి కెరటాలకు యువకుడు బలి
- మరో వ్యక్తి గల్లంతు



కొక్కిలగడ్డ జితేంద్ర సాయి

కొత్తపట్నం: బీచ్‌లో ఇద్దరు యువకులు గల్లంతు కాగా ఒక వ్యక్తిని మెరైన్‌ పోలీసులు కాపాడి హాస్పిటలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందిన సంఘటన కొత్తపట్నంలో ఆదివారం జరిగింది. ఒంగోలు నరంలో కొండ మీద నివాసం ఉంటున్న కొక్కిలగడ్డ జితేంద్రసాయి (33) బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తుంటాడు. ఇతని తండ్రి మీరాసాహెబ్‌ది కె.పల్లెపాలెం కాగా ఒంగోలు పంచాయతీ రాజ్‌ శాఖలో ఉద్యోగం చేస్తుంటాడు. తను కుమార్తెకు వివాహం చేసేందుకు పల్లెపాలెంలో ఇల్లు మరమ్మతులు చేయటానికి కుటుంబ సమేతంగా వచ్చారు. సింగరాయకొండ గ్రామానికి చెందిన అవనిగడ్డ కార్తీక్‌ (20), కొక్కిలగడ్డ జితేంద్ర బంధువు కావడంతో తిరునాళ్ల కోసం అని పల్లెపాలెం వచ్చాడు. ఆదివారం సముద్ర స్నానం చేయాలని ఇద్దరూ దిగారు. సముద్ర స్నానం చేస్తుండగా అలల ఉధృతికి ఇద్దరూ గల్లంతయ్యారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న మెరైన్‌ పోలీసులు కొక్కిలగడ్డ జితేంద్రసాయిను బయటకు తీశాడు. వెంటనే 108 వాహనంతో ఒంగోలు హాస్పిటల్‌కు తరలిస్తుండగా అల్లూరుకు వెళ్లే మార్గమధ్యంలో ప్రాణాలు విడిచాడు. అవనిగడ్డ కార్తీక్‌ కోసం సముద్రంలో గాలిస్తున్నారు. ఎస్సై సాంబశివరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

సేవలకు చిరునామా



అల్లూరు గ్రామ సచివాలయం

వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గ్రామ, వార్డు సచివాలయాలు సేవలకు చిరునామాగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను ప్రజలను పారదర్శకంగా అందించేందుకు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఈ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. పారదర్శకత, అవినీతి రహితం, విశ్వసనీయతతో ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయడమే లక్ష్యంగా అడుగులు వేశారు. జిల్లాలో కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ సచివాలయ వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉద్యోగుల పనితీరును నిత్యం పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో సచివాలయాల ద్వారా ఇప్పటి వరకు 23,64,822 సేవలను ప్రజలకు అందించారు.

- ప్రభుత్వ సేవలు చేరువ చేయడమే లక్ష్యంగా సచివాలయాల ఏర్పాటు
- గ్రామ, వార్డు సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం
- జిల్లాలో మొత్తం 719 గ్రామ, వార్డు సచివాలయాలు
- 11 శాఖల ఉద్యోగులతో 540కిపైగా సేవలు
- జిల్లాలో 6,470 మంది సచివాలయ ఉద్యోగులు, 11,941 మంది వలంటీర్లు

ఒంగోలు అర్బన్‌:

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసింది. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 597 గ్రామ సచివాలయాలు, 122 వార్డు సచివాలయాలు ఏర్పాటయ్యాయి. జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయాల్లో మొత్తం 6,470 మంది ఉద్యోగులు ప్రజలకు సేవలందిస్తున్నారు. వీటికి తోడు ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి ఇళ్ల వద్దకే ప్రజా సేవలు తీసుకెళ్తున్నారు. జిల్లాలో 11,941 మంది వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా సేవలందిస్తున్నారు. సచివాలయాల ద్వారా ఇప్పటి వరకు 23,64,822 సేవలను ప్రజలకు అందించారు. సచివాలయాల్లో 91 ఆధార్‌ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు.

గ్రామాల్లోనే 11 శాఖల ఉద్యోగులు...

గతంలో ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. అక్కడ కూడా ఒక్కో కార్యాలయం ఒక్కో ప్రాంతంలో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. కానీ సచివాలయాల్లో 11 శాఖల ఉద్యోగులు ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్నారు. పంచాయతీ సెక్రటరీ, పంచాయతీ సెక్రటరీ గ్రేడ్‌-6, ఎడ్యుకేషనల్‌ అసిస్టెంట్‌, ఏఎన్‌ఎం, వెటర్నరీ అసిస్టెంట్‌, అగ్రికల్చర్‌ అసిస్టెంట్‌, ఇంజినీరింగ్‌ అసిస్టెంట్‌, సర్వేయర్‌, వీఆర్‌ఓ, మహిళా పోలీసు, ఎనర్జీ అసిస్టెంట్‌ పోస్టులను ప్రభుత్వం నియమించింది. వార్డు సచివాలయాలకు సంబంధించి 10 పోస్టుల్లో అడ్మినిస్ట్రేటివ్‌ సెక్రటరీ, ఎడ్యుకేషన్‌ డేటా ప్రాసెసింగ్‌ సెక్రటరీ, వెల్ఫేర్‌ డెవలప్‌మెంట్‌ సెక్రటరీ, హెల్త్‌ సెక్రటరీ, రెవెన్యూ సెక్రటరీ, ప్లానింగ్‌ రెగ్యులేషన్‌ సెక్రటరీ, శానిటేషన్‌ ఎన్విరాన్‌మెంట్‌ సెక్రటరీ, ఉమెన్‌ ప్రొటెక్షన్‌ సెక్రటరీ, ఆమనిటీస్‌ సెక్రటరీ, ఎనర్జీ సెక్రటరీ పోస్టుల ద్వారా ప్రజలకు సేవలు అందుతాయి.

ఉద్యోగ విప్లవం...

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సేవలు ఇప్పటికే ప్రజలకు చేరువై మన్ననలు పొందుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చినట్లుగా సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించి ప్రొబేషన్‌ డిక్లరేషన్‌ చేసి రెగ్యులర్‌ పేస్కేల్‌ కిందకు తీసుకొచ్చారు. దీంతో సచివాలయ ఉద్యోగుల ప్రభుత్వ ఉద్యోగం కల సాకారమైంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సచివాలయ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు నేరుగా సేవలందించే అదృష్టంతో పాటు ఉద్యోగానికి భరోసా కలిగిందంటూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఉద్యోగులంటున్నారు.

337 భవన నిర్మాణాలు పూర్తి...

జిల్లాలో మొత్తం 593 సచివాలయాలకు భవన నిర్మాణాలు మంజూరు కాగా, ఇప్పటికే 337 భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ నిర్మాణాలకు ఉపాధి హామీ పథకం నుంచి రూ.226 కోట్ల నిధులు కేటాయించారు.

ప్రభుత్వ లక్ష్యాల మేరకు సచివాలయ సేవలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ సేవలు, పథకాలను పారదర్శకంగా చేరువ చేయాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఆ లక్ష్యం మేరకు ప్రజలకు సేవలందించేందుకు పక్కా చర్యలు తీసుకున్నాం. నిరంతరం సచివాలయాలను సందర్శించడంతో పాటు ప్రజలకు అందే సేవలను పర్యవేక్షిస్తున్నాం. సచివాలయ ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వేలాది మంది యువతకు ఉద్యోగాలు వచ్చాయి.

– ఏఎస్‌ దినేష్‌కుమార్‌, కలెక్టర్‌

ప్రజలకు వేగవంతమైన సేవలు



సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రజలకు అందాల్సిన సేవలు, సంక్షేమ పథకాలు వేగంగా పారదర్శకంగా అందుతున్నాయి. గతంలో ఏదైనా ఒక కార్యాలయంలో పని కావాలంటే ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. సచివాలయ వ్యవస్థతో ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సర్వీసులు సచివాలయాల్లో అందుతూ ఇంటికే చేరుతున్నాయి. ఏదైనా సర్టిఫికెట్‌ కావాలంటే వలంటీర్‌, సచివాలయాల ద్వారా పని పూర్తిచేసి లామినేషన్‌ చేసి మరీ దరఖాస్తుదారుడి ఇంటికి చేరుతోంది. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సచివాలయాలు, వలంటీర్‌ వ్యవస్థ పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతోంది. కలెక్టర్‌ నిరంతరం సమీక్షిస్తూ దిశా నిర్దేశం చేసిన మేరకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– టి.ఉషారాణి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి

రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీల విజేత నంద్యాల

సింగరాయకొండ(టంగుటూరు): సింగరాయకొండ మండలం పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీకృష్ణ యాదవ యూత్‌ఫోర్సు ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీల్లో నంద్యాల జట్టు విజేతగా నిలిచింది. పోటీలు శనివారం అర్ధరాత్రి వరకు జరిగాయి. పోటీల్లో ఏడు జట్లు పాల్గొనగా నంద్యాల జిల్లా కొత్తకోట గ్రామానికి చెందిన డాక్టర్‌ గురునాథ్‌ ఎడ్ల జత నిర్ణీత సమయంలో 3,460 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ బహుమతి రూ.70 వేలు సాధించింది.

కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్‌ ఎడ్ల జత 3,144 అడుగుల దూరాన్ని లాగి ద్వితీయ బహుమతి రూ.50 వేలు, టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్ల జత 3000 అడుగులు దూరాన్ని లాగి తృతీయ బహుమతి రూ.40 వేలు, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్ల జత రూ.30 వేలు, అదే గ్రామానికి చెందిన బత్తుల బాలరాజు, వీరాస్వామి చౌదరి జట్టు ఐదో బహుమతి రూ.20 వేలు, గుంటూరు జిల్లా లింగాయి పాలెం చెందిన మల్లం సాంబశివరావు జట్టు ఆరో బహుమతి రూ.12 వేలు, సింగరాయకొండ మండలం ఊళ్లపాలెంకు చెందిన మర్రి పాపిరెడ్డి ఎడ్ల జత ఏడో బహుమతి రూ.10 వేలు సాధించాయి.

ఏపీసీపీడీసీఎల్‌లో బదిలీలు

నూజివీడు: ఏలూరు జిల్లా ఏపీసీపీడీసీఎల్‌ నూజివీడు డివిజన్‌లో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈఈ డి.కృష్ణనాయక్‌ ఉయ్యూరుకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఒంగోలు నుంచి ఎ.సత్యనారాయణ ఇక్కడకు రానున్నారు. ఈయన బాధ్యతలు సైతం స్వీకరించారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న మెప్మా పీడీ రవికుమార్‌



మెగా జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

- నిరుద్యోగులు లేని జిల్లాగా ప్రకాశం జిల్లా ఆదర్శంగా నిలపాలి

మద్దిపాడు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడెప్‌ల సంయుక్తల ఆధ్వర్యంలో మద్దిపాడులో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాను మెప్మా పీడీ రవికుమార్‌ ప్రారంభించారు. జాబ్‌మేళాలో 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా 391 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్వ్యూ తరువాత వీరిలో 118 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ రవికుమార్‌ మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే ఏదో ఒక రంగంలో రాణించవచ్చన్నారు. ఉద్యోగం రాని వారు నిరాశ చెందకుండా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఏపీఎస్‌ఎస్‌డీసీ ద్వారా అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డీఎస్‌డీఓ లోకనాథం మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగులకు శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. యువత కమ్యూనికేషన్‌ స్కిల్స్‌ మెరుగుపరుచుకోవాలని సూచించారు. మరో ముఖ్య అతిథి భరద్వాజ మాట్లాడుతూ ప్రతి మొదటి మొదటి శుక్రవారం నియోజకవర్గాల్లో జాబ్‌మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం స్కిల్‌హబ్‌ ద్వారా శిక్షణ పొందిన 30 మంది బ్యూటీషియన్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జేఈఓ రాజారావు, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌ నరేంద్రనాథ్‌, చంద్రశేఖర్‌, అజయ్‌, స్కిల్‌ డెవలప్‌మెంట్‌ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చెంబులతో వినూత్న నిరసన



ఎమ్మెల్యే స్వామి ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న పేదలు

టంగుటూరు: వైఎస్సార్‌ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో 'చెంబులతో ఎమ్మెల్యే స్వామి ఇంటికి' వినూత్న నిరసన కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు తెలిపారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం మరుగుదొడ్ల వినియోగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో విడుదల చేసిన నిధులు 2014–19 మధ్య కాలంలో టీడీపీ నేతలు తప్పుడు పేర్లతో కొల్లగొట్టారని విమర్శించారు. కొండపి నియోజకర్గంలో ఎమ్మెల్యే స్వామి నేతృత్వంలో వేల సంఖ్యలో మరుగుదొడ్లు నిర్మించకుండానే.. నిర్మించినట్లుగా పేపర్ల మీద చూపి రూ.22 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే స్వామి అవినీతిని సాక్ష్యాలతో సహా వరికూటి అశోక్‌బాబు బట్టబయలు చేసి, పేదల సొమ్ము రూ.22 కోట్లను తిరిగి ఇచ్చేయాలని పలుమార్లు డిమాండ్‌ చేసినా ఆయన నోరువిప్పలేదన్నారు. ఈ నేపథ్యంలో కొండపి నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేస్తూ సోమవారం ఉదయం 8 గంటలకు టంగుటూరు వైఎస్సార్‌ సీపీ కార్యాలయం నుంచి 2 వేల మందితో తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే స్వామి ఇంటి వరకు చెంబులతో వెళ్లి నిరసన తెలుపుతున్నట్లు చెప్పారు. మరుగుదొడ్ల లెక్కలు తేల్చేవరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి రాధాడు పోటీలు

సింగరాయకొండ(టంగుటూరు): పురాణ ప్రసిద్ధి చెందిన పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం రాష్ట్రస్థాయి రాధాడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో కృష్ణ, బాపట్ల, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఎనిమిది జట్ల ఎడ్లు పాల్గొన్నాయి. పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జతలు నువ్వా..నేనా అన్నట్లు పోటీ పడటంతో పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.



పోటీలో తలపడుతున్న ఎద్దు

విద్యార్థులకు పోటీలు

ఒంగోలు: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర సాంకేతిక సంస్థ, జిల్లా విద్యాశాఖ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీల్లో అప్‌కాస్ట్‌ జిల్లా కో ఆర్డినేటర్‌ టి.రమేష్‌, అకాడమీ కో ఆర్డినేటర్‌ బి.తిరుపతయ్య, గ్రంథాలయ సంస్థ జాయింట్‌ సెక్రటరీ బి.కోటేశ్వరి, జిల్లా శ్రీనివాసరావు, పీవీ రమణయ్య , ఎస్‌.నాగేశ్వరరావు పాల్గొన్నారు. విజేతలకు సోమవారం జరిగే పర్యావరణ దినోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తామని అప్‌కాస్ట్‌ కో ఆర్డినేటర్‌ టి.రమేష్‌ తెలిపారు.



డ్రాయింగ్‌ పోటీలో పాల్గొన్న చిన్నారులు

భానుడి భగ భగ..

- తీవ్రంగా పెరుగుతున్న ఎండ తీవ్రత
- వేడి గాలులతో సతమతమవుతున్న ప్రజానీకం
- వేడి సెగలు, ఉక్కపోతతో బెంబేలు
- ఉదయం 8 గంటల నుంచే ఉక్కపోత
- జిల్లాలో 42 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదు
- అవసరమైతే తప్ప బయటకు రావద్దంటున్న వైద్యులు



ఒంగోలు అర్బన్‌: భానుడు మళ్లీ ఉగ్రరూపం దాలుస్తున్నాడు. ఇటీవల వాతావరణం కొంత చల్లబడినా రెండు రోజులుగా ఒక్కసారిగా వేడి తీవ్రత, వడగాలులు ఎక్కువయ్యాయి. జిల్లాలో 42 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యల్ప ఉష్ణోగ్రతలు సైతం 32 డిగ్రీల పైనే ఉండటంతో వాతావరణం వేడిగా మారుతోంది. దీంతో పనులపై బయట తిరుగుతున్న ప్రజలకు ఎండ తీవ్రత సెగలు తప్పడం లేదు. పైగా వేడి గాలులు వీస్తుండటంతో వడదెబ్బలు తగిలే ప్రమాదం పొంచి ఉంది. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. అత్యవసర పనులకు సైతం ఎండ సమయంలో బయటకు తిరగాలంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ఎండలు, వేడి గాలుల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావడం మంచిది కాదంటున్నారు. ఉదయం 10 గంటల లోపు పనులు చూసుకుని ఎండ తీవ్రత తగ్గిన తర్వాత సాయంత్రం సమయంలో మాత్రమే బయటకు రావాలని వైద్యులు సూచిస్తున్నారు. ఒక వేళ అవసరం రీత్యా బయటకు వచ్చినా తాగునీరు, ఓఆర్‌ఎస్‌ వంటివి అందుబాటులో ఉంచుకోవాలని, తలపై టోపీ లేదా గొడుగు వంటివి వినియోగించాలని సూచిస్తున్నారు. డీహైడ్రేషన్‌, వడ దెబ్బ తగలకుండా తాగునీరు, కొబ్బరినీళ్లు, గ్లూకోజ్‌, ఓఆర్‌ఎస్‌, మజ్జిగ, పండ్ల రసాలు వంటివి ఎక్కువగా తీసుకోవాలని చెబుతున్నారు. మరో వారం పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. ఎండ తీవ్రతకు తల తిరిగినా, నోరు పొడిబారిపోయినా, వడదెబ్బ తగిలినట్లు అనుమానం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని సూచిస్తున్నారు.

శరీరానికి వ్యాయామం ముఖ్యం



మార్షల్‌ ఆర్ట్స్‌ క్యాంపుకు హాజరై సర్టిఫికెట్లు పొందిన చిన్నారులు

ఒంగోలు: శరీరానికి వ్యాయామం ఎంతో ముఖ్యమని నెహ్రూ యువకేంద్ర ఆఫీసర్‌ కమల్‌సా, సెంట్రల్‌ యూనివర్శిటీ ప్రొఫెసర్‌ వి.దిలీప్‌కుమార్‌ అన్నారు. జిల్లా క్రీడాసాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి స్థానిక ట్రూ ఫైటర్స్‌ మార్షల్‌ ఆర్ట్స్‌ అకాడమీలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్‌ క్యాంపు శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన వ్యాయామం విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడుతుందన్నారు. ఉచిత సమ్మర్‌ క్యాంపు నిర్వహణకు ముందుకు వచ్చిన అకాడమీ ప్రతినిధులను అభినందించారు. ట్రూఫైటర్స్‌ మార్షల్‌ ఆర్ట్స్‌ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు, పర్వతారోహకుడు షేక్‌ హిమాంస మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటి ట్రెక్కింగ్‌ కంపెనీని త్వరలోనే ప్రారంభిస్తామని, సంబంధిత లోగోను ఆవిష్కరించారు. డిసెండెన్స్‌ ఆఫ్‌ భగత్‌సింగ్‌ ఐడియాలజీ అనే స్వచ్ఛంద సంస్థను కూడా ప్రారంభించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితశిక్షణ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌ వై సంతోష్‌కుమార్‌, క్రీడాకారులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందించారు.

క్లుప్తంగా

పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య



వివరాలు సేకరిస్తున్న ఎస్సై క్రిష్ణవేణి

పెద్దదాస్లపల్లి, (హనుమంతునిపాడు): మండలంలోని పెద్ద దాస్లపల్లిలో ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్లితే.. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు పెద్ద దాస్లపల్లి గ్రామంలోని ముత రాసి కులంకు చెందిన పగ్గాల చెన్నమ్మ కుమారుడు పగ్గాల వెంకటరమణయ్య (28) చెడు అలవాట్లకు, తాగుడకు బానిసయ్యాడు. తాగి రోజూ భార్యాబిడ్డలతో గొడవ పడుతుండే వాడు. చెడు అలవాలట్లకు, తాగుడకు బానిసగా మారిన వెంకటరమణ.. జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం మద్యంలో పురుగు మందు కల్పుకొని ఆత్మ హత్యకు పాల్పడాడు. కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. మృ తునికి భార్య బాలగురవమ్మ, తల్లి చెన్నమ్మ, ఇద్దరు పిల్లలున్నారు. తల్లి చెన్నమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై జి. క్రిష్ణ పావని తెలిపారు.

రంగస్థల నటుడు సుబ్బారావు మృతి




నటుడు సుబ్బారావు (ఫైల్)

మేదరమెట్ల: ప్రముఖ రంగస్థల నటుడు చలివేంద్ర సుబ్బారావు (57) ఆదివారం హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలంలోని బొల్లవరప్పాడు గ్రామానికి చెందిన సుబ్బారావు వందలాది నాటకాల్లో పలు పాత్రలు పోషించారు. సత్యహరిశ్చంద్ర నాటకంలో విశ్వామిత్రుడు, కాలకౌసికుడు, వీరబాహుడు, పాత్రలతో పాటు చింతామణిలో సుబ్బిశెట్టి పాత్రలో జీవించి ప్రేక్షకులను మెప్పించారు.

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సుబ్బారావు పార్థివ దేహానికి స్వగ్రామంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు స్నేహితులు తెలిపారు.

ఈ ఫలం విషతుల్యం



ఆరోగ్యాన్ని కాపాడటంలో పండ్లది విశేష స్థానం. వీటిలో దొరికే విటమిన్లు, ఖనిజ లవణాలు, ఇతర పోషక విలువలతో రోగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఇలాంటి అమృత ఫలాలను కూడా వ్యాపారులు విషంగా మార్చేస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారు.

- పండ్లను రసాయనాల్లో మగ్గబెడుతున్న వ్యాపారులు
- మామిడిలో విపరీతంగా వినియోగం
- వీటిని తింటే దుష్ప్రభావాలు

మార్కాపురం: కాలానుగుణంగా వచ్చే పండ్లను చూస్తే నోరూరాల్సిందే. అయితే రేటు ఎక్కువైనా ఫర్వా లేదని కొనుగోలు చేసిన తర్వాత ఆందోళన చెందడం పరిపాటిగా మారింది. పండే సమయంలో ఎలాగూ రైతులు పురగు మందులు పిచికారీ చేస్తారు. అయితే అవి త్వరగా మగ్గబెట్టేందుకు వ్యాపారులు నిషేధిత రసాయనాలు వాడుతుండటం ఆందోళన కరంగా మారింది. ఇలాంటి పండ్లను శుభ్రం చేసుకుని తిన్నా రోగాలు తప్పవు. సహజ పద్ధతిలో పండ్లు పక్వానికి రావాలంటే ఎక్కువ సమయం పడుతుంది. దీంతో వ్యాపారస్తులు కార్బైట్‌తో మగ్గిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిబదులు సాంకేతిక పద్ధతిలో పండ్లను మగ్గబెట్టేలా వ్యాపారుల్లో అవగాహన తేవాలని డిమాండ్లు వినిపిస్తున్నా పట్టించుకొనే నాథుడు కానరావడంలేదు. నిషేధిత కాల్షియం కార్బైట్, ఇథిలిన్ వాయువు ఉపయోగించి పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా పండ్లను మగ్గపెడుతూ అమ్ముతున్నారు. ఈ సీజన్‌లో ఉలవపాడు, సింగరాయకొండ, టంగుటూరు వంటి ప్రాంతాల్లో మామిడి పండ్లను కొనుగోలు చేసి త్వరగా మగ్గ పెట్టి అమ్మేందుకు వ్యాపారులు ఇలాంటి పద్ధతులు వాడుతున్నారు.

పశ్చిమ ప్రాంతంలో..

మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం తదితర పట్టణల్లో ఈ దందా కొనసాగుతోంది. మార్కాపురంలో రోజుకు 500 నుంచి 700 కిలోల మామిడి పండ్ల విక్రయాలు చేస్తున్నారు. వాటిని కార్బైడ్ వినియోగించకుండా అమ్ముతున్నారా, అనే విషయం వాటిని విక్రయించే వ్యాపారులు, వినియోగించే కొనుగోలుదారులకు తెలిసే అవకాశం లేదు. కొంత మంది వ్యాపారులు మాత్రం ఉలవపాడు నుంచి నేరుగా చెట్టు నుంచి కోసిన కాయలు తెచ్చి విక్రయిస్తున్నారు.

ఇలా వాడుతున్నారు

పట్టణంలో అరటి, మామిడి, బొప్పాయి, తదితర పండ్లను ఎక్కువగా అమ్ముతుంటారు. కాయల మధ్య కార్బైడ్ పొడిని కాగితపు పొట్లాల్లో ఉంచి పసుపు రంగు మారే వరకు అలాగే ఉంచుతారు. ఆసహజ పద్ధతిలో పక్వానికి వచ్చిన పండ్లను హోల్ సేల్ వ్యాపారులు వ్యాపారులకు యథేచ్ఛగా పంపిణీ చేస్తున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత శాఖాధికారులు తనిఖీలు చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మామిడి పండ్లు

తీవ్ర అనారోగ్య సమస్యలు

మామిడి పండ్లను వరి గడ్డి, బోదగడ్డితో నాలుగైదు రోజులు మగ్గ పెడితే సహజంగా పండుతాయి. కానీ వ్యాపారులు త్వరగా అమ్ముకునేందుకు కాల్షియం కార్బైట్, ఇథాలిన్‌తో మగ్గ పెట్టడం వలన ఒక్కటిన్నర రోజుల్లో పండిపోతాయి. కాల్షియం కార్బైడ్ మనిషి ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతుంది. డయేరియా, కీళ్ళ నొప్పులు, అల్సర్, అసిడిటీ, అలర్జీలు వస్తాయి. షుగర్ వ్యాధిగ్రస్తులకు తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయి.

– డాక్టర్ సీతారామిరెడ్డి, ఎండీ, మార్కాపురం



కఠిన చర్యలు తప్పవు

వివిధ రసాయనాలతో మగ్గపెట్టిన కాయలను అమ్మితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వం జీఓ కూడా జారీ చేసింది. ఆహార పదార్థాల కల్తీ నిరోధక చట్టం 1954లోని 37వ చట్టంను అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం కల్తి చేసిన ఆహార పండ్లను అమ్మితే ఏడాది నుంచి ఆరేళ్ళలోపు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

– రవీంద్రనాథ్, న్యాయవాది, మార్కాపురం



కేవైసీ అప్‌డేట్ పేరుతో మోసాలు



ఒంగోలు టౌన్: కేవైసీ అప్‌డేట్ పేరుతో జరుగుతున్న మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలిక గర్గ్ ఓ ప్రకటనతో తెలిపారు. బ్యాంకులు, టెలికం సంస్థల పేరుతో ఫోన్ చేస్తున్న పలువురు సైబర్ నేరగాళ్ళు తక్షణమే కేవైసీ అప్‌డేట్ చేయాలని, లేకుంటే సేవలను నిలిచిపోతాయని బెదిరిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వారి మాటలు నమ్మి పాన్, ఆధార్ కార్డు నెంబరు, పిన్ నెంబర్లు, ఓటీపీ చెప్పవద్దని సూచించారు. ఎలాంటి లింకులు పంపించినా నమ్మవద్దని చెప్పారు. కేవైసీ కాల్ పేరుతో ఫోన్లు వస్తే గుడ్డిగా నమ్మవద్దని, ఇలాంటి మోసాలపై అవగాహన కల్పించుకోవాలని తెలిపారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి...

- కేవైసీ అప్‌డేట్ లేదా కస్టమర్ కేర్ పేరుతో అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లు, మెసేజ్‌లకు ఎలాంటి పరిస్థితుల్లో స్పందించవద్దు.
- వెరిఫికేషన్ కోసం ఏదైనా నెంబరు చెప్పమని అడిగితే ఇవ్వరాదు.
- ఫలానా కంపెనీ అని కేవైసీని అప్‌డేట్ చేయాలని వచ్చిన ఫేక్ లింకులు, అటాచ్‌మెంట్లను క్లిక్ చేయరాదు.
- కేవైసీ అప్‌డేట్ కోసం బ్యాంకులు కానీ, టెలికాం సంస్థలు కానీ ఎలాంటి లింకులు పంపించవు అనే విషయాన్ని గుర్తించుకోవాలి.
- మీ ఖాతా క్లోజ్ అయిందని వచ్చే వెబ్‌లింకులపై క్లిక్ చేయకుండా బ్రౌజర్లో సంబంధిత అధికారికి వెబ్‌సైట్స్ ఓపెన్ చేసి లాగిన్ వివరాలు తెలుసుకోవాలి.
- ఇంటర్నెట్ బ్యాంకింగ్ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్, పిన్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, బ్యాంక్ ఖాతా నెంబర్, కార్డు వెరిఫికేషన్ వాల్యూ నంబర్ మొదలైన వ్యక్తిగత సమాచారాన్ని ఫోన్లో పంచుకోవద్దు.
- ఎవరైనా ఈ తరహా నేరాలకు గురైతే వెంటనే సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలని ఎస్పీ సూచించారు.

తాళం వేసిన గృహంలో రూ. 5 లక్షల చోరీ

కొమరోలు: ఎవరూ లేని ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మండల కేంద్రమైన కొమరోలులోని చెక్‌పోస్టు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొమరోలులోని చెక్‌పోస్టు ఆవరణలో ఎర్రపల్లె గ్రామానికి చెందిన మారంరెడ్డి లక్ష్మీరెడ్డి ఆర్మీ ఉద్యోగం చేస్తూ సెలవుపై శనివారం కొమరోలుకు వచ్చాడు. తాను అప్పు తెచ్చిన 5 లక్షల రూపాయల నగదును కొమరోలులోని చెక్‌పోస్టు ఆవరణలో తన బావ ఇంట్లో బీరువాలో పెట్టాడు. స్వగ్రామమైన ఎర్రపల్లె గ్రామానికి వెళ్ళి తిరిగి ఆదివారం వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఇంట్లోని బీరువాను పగులగొట్టి రూ. 5 లక్షల నగదు, మాటీలు, తాళి బొట్టుబిల్ల చోరీ జరిగినట్లుగా గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో కొమరోలు ఎస్సై సుబ్బరాజు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గృహాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు ఎస్సై సమాచారం అందించడంతో మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, గిద్దలూరు సీఐ దేవప్రభాకర్, రాచర్ల ఎస్సై మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఒంగోలు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ బృందం గృహంలో వేలి ముద్రలు సేకరించారు. మారంరెడ్డి లక్ష్మీరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



దొంగలు పగులగొట్టిన తాళాన్ని పరిశీలిస్తున్న గిద్దలూరు సీఐ దేవ ప్రభాకర

వడదెబ్బకు వృద్ధురాలి మృతి

చీమకుర్తి: స్థానిక మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ కట్టా గంగయ్య బార్య జాలమ్మ (75) ఆదివారం వడదెబ్బకు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గంగయ్య కాంగ్రెస్ పార్టీ తరఫున చీమకుర్తి పంచాయతీగా సర్పంచ్‌గా గతనంలో పనిచేశారు. ఆయన భార్య జాలమ్మ మృతి చెందటంతో వారి కుటుంబ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, స్థానిక నాయకులు పూలమాలలుతో నివాళులర్పించారు.



కట్టా జాలమ్మ (ఫైల్)

అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్ లక్ష్యం



యేలూరులో పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

పొదిలి రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం పొదిలి మండలంలోని యేలూరు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి మాట్లాడుతూ కులం, మతం, పార్టీ భేదం లేకుండా రాజకీయలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ధ్యేయమన్నారు. గత ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు దయ ఉంటే పేదలకు సంక్షేమ పథకాలు అందేవని, ఇప్పడా పరిస్థితి లేదన్నారు. ఎలాంటి సిఫార్సులు లేకుండానే అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు ఓర్చుకోలేక పోతున్నారని విమర్శించారు. టీడీపీ, అధికారంలో ఉన్నన్నాళ్లు ప్రజల సంక్షేమం మరచి, కేవలం దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఎక్కడా అవినీతికి అస్కారం లేకుండా ప్రజా సంక్షేమమే పాలనా సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పై టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని మండపడ్డారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా ప్రజలను గందరగోఆనికి గరిచేయడానికి ముందస్తు ఎన్నికలు వస్తాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

జన నీరాజనం

గడప గడపకు వచ్చిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఆయా గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. స్థానిక నాయకులు జిల్లాసేవదళ్ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గుజుల గిరిబాబు రెడ్డి, సర్పంచ్ సింగయ్య, సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బాణసంచాతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ పి. శ్రీకృష్ణ, ఈఓఆర్డీ రాజశేఖర్, పీఆర్ ఏఈ మస్తాన్, గ్రామీణ నీటి సరఫరా ఏఈ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి శేషు, నాయకులు పార్టీ రాష్ట్రకార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి రమణారెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్ బేగం, గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, జి. శ్రీనివాసులు, కె. నరసింహారావు, కొత్తపుల్లి బ్రహ్మ రెడ్డి, గూడూరి వినోద్, పులిగొర్ల శ్రీనివాసలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకుంటున్న విశ్వబ్రాహ్మణ విద్యార్థులు

ఒంగోలు: పదో తరగతిలో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన విశ్వబ్రాహ్మణ విద్యార్థుల అభినందన సభ స్థానిక విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ కళ్యాణమండపం ప్రధాన కార్యదర్శి పాతకమూరి బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. అత్యధిక మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచిన జూపూడి శ్రీనివాస్‌కు అమృత హాస్పిటల్ అధినేత డాక్టర్ వి.కేశవ్ రూ.5116 అందించారు. రెండో బహుమతిని చోడ నేహామృతకు కల్యాణ మండపం అధ్యక్షుడు చోడ శ్రీనివాస్, కోశాధికారి మంచా బాబు ప్రధానం చేశారు. మూడో బహుమతిని కొనికి కోటేశ్వరరావుకి జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ ముల్లపాటి దొరసానాచారి అందించారు. ఆంజనేయస్వామి పీఠాధిపతులు గోనుగుంట బ్రహ్మనంద సిద్ధాంతి మాట్లాడుతూ విద్య వల్ల మంచి ఉన్నత స్థాయికి చేరుకోవడం సాధ్యపడుతుందన్నారు. ఉన్నత స్థాయికి చేరుకునే విద్యార్థులకు సామాజికవర్గం పరంగా సాయం అందించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తఆలూరు రామబ్రహ్మాచారి, తక్కెళ్లపాడు శ్రీధర్‌కుమార్, పీఎస్ బాబు, పాలెపు నాగభూషణాచారి, పత్తిపాటి వీరబ్రహ్మచారి, నూతలపాటి శేషాచారి, గోనుగుంట మోహన్‌కృష్ణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మానసిక సమస్యలతో లారీ డ్రైవర్ ఆత్మహత్య



లారీ కింద పడి ఆత్మహత్య చేసుకున్న భాస్కర్ బాబు

మార్టూరు: ఒంటరి తనం ఆపై మానసిక సమస్యలతో ఓ లారీ డ్రైవర్ తాను నిత్యం నడిపే లారీ టైర్లు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని జంగమహేశ్వర పురంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ కమలాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన చిలకా భాస్కర్ బాబు (55) చాలా కాలంగా జంగమ హేశ్వరపురంలోని ఏ. ప్రభాకరరెడ్డికి చెందిన క్రషర్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలి కాలంలో అనారోగ్యం కారణంగా భార్య మరణించినప్పటి నుంచి భాస్కర్ బాబు ఒంటరి తనంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. గతంలో ఒకసారి ఆత్మహత్య యత్నం చేయగా స్థానికులు గుర్తించి కాపాడారు. ఆదివారం ఉదయం భాస్కర్ బాబు తాను నిత్యం నడిపే లారీ వద్దకు వెళ్లి లారీని గేరు నుంచి న్యూట్రల్ చేయడంతో కిందకు దిగే క్రమంలో లారీ కుడివైపు వెనకు టైర్ల కింద తలపెట్టి పడుకున్నాడు. లారీ భాస్కర్ బాబు తలపై నుంచి వెళ్ళడం అతడు అక్కడికక్కడే మృతి చెందడం క్షణాల్లో జరిగి పోయాయి. మృతుని కుమారుడు రత్నకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కమలాకర్ ఘటనా స్థలికి వెళ్ళి భాస్కర్ బాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉల్లాసంగా రాష్ట్ర స్థాయి పోల్‌రాధా పోటీలు

స్వర్ణ (కారంచేడు): గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ల పురస్కరించుకొని ఆదివారం రాత్రి రాష్ట్ర స్థాయి జూనియర్ నాటు ఎడ్ల పోల్ రాధా పోటీలు రసవత్తరంగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన సుమారు 16 ఎడ్ల జతలు ఈ పోటీలలో పాల్గొన్నాయి. 300 మీటర్ల పొడవు, రెండు క్వింటాళ్ళ ఇసుక బస్తాలను వేసుకొని బండిని లాగాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నీరకట్టు రామారావు హాజరయ్యారు.